# కర్మయోగి - కిడంబి రఘునాథ్

- గుత్తికొండ పద్మ, కిరణ్, రవీంద్రనాథ్

ఆప్త మిత్రుడు రఘునాథ్ అకాల అస్తమయం చేసారని తెలిసి అత్యంత ఆవేదన కలిగింది. మొదటి సారి పరిచయం నుండి అన్నీ గుర్తుకు వచ్చాయి.

కుమార్తె ఉష దాదాపు రెండు సంత్సరాల వయస్సు ఉన్నప్పుడు హోబోకెన్ లోని స్టీవెన్స్ ఇన్స్టిట్యూట్‌లో ఆయన విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో రఘునాథ్, ప్రభ, ఉష పరిచయమయ్యారు. అప్పటినుంచి మేమిద్దరము అనేక సందర్భాలలో కలిసి పనిచేయడం జరిగింది.

అటువంటి మిత్రుడు రఘునాథ్ భౌతికంగా ఇంక లేడు అంటే ఎంత అన్యాయం జరిగింది అని మనస్తాపం కలిగింది. సనాతన ధర్మం ప్రకారం, ఇహలోకం నుంచి పరలోకయాత్రకు కారణం జీవులందరూ కారణజన్ములని, జీవనకాలంలో కొన్ని భాద్యతలను నెరవేర్చవలసిన అవసరం ఉండటంవలన పుట్టడం జరుగుతుందని, భాద్యతలను నెరవేర్చిన తదుపరి గతించి మోక్షానికి చేరడంగాని, పునర్జన్మలో మరికొన్ని భాద్యతలను స్వీకరించడం గాని జరుగుతుందని ఆధ్యాత్మిక చింతనగల యోగ్యులు విశదీకరించారు.

రఘునాథ్ తన జీవన కాలంలో సాధించినవి అనేకం ఉన్నా, నేను ఇతరులకు తెలియని కొన్నింటిని మాత్రమే ప్రస్తావించి, ఇతర బంధుమిత్రుల అనుభవాలకు అనుబంధంగా పాలు పంచుకోవడం నా ధర్మంగా భావిస్తున్నాను. నన్ను ప్రత్యేకంగా రఘునాథ్ దాతృత్వాన్ని గూర్చి ప్రస్తావించమన్నారు మిత్రులు కలశపూడి శ్రీనివాసరావు గారు. ఈ విషయం చివరలో చెబుతాను.

1976లో వినాయకచవితి రోజున ప్రప్రధమ ఉత్తర అమెరికా తెలుగు సమ్మేళనం జరుపుటకు నాంది పలికిన పిదప అక్టోబర్‌లో మొదటి కార్యవర్గ సమావేశాన్ని స్టీవెన్స్ ఇన్స్టిట్యూట్‌లో పెట్టమని రఘునాథ్ ప్రోత్సహించి, తను సాంస్కృతిక కార్యక్రమాల బాధ్యతను స్వీకరించి నా కన్వీనర్ బాధ్యతలను సహృదయంతో పంచుకున్నారు. 1977 మేలో ఆ సమ్మేళనం దిగ్విజయంగా జరిగిన విషయం ఆహూతులకు తెలుసు. 1977 చివరలో విడుదలైన సమ్మేళనపు నివేదికలో తన అనుభవాలను చిత్రీకరించి, భవిష్యత్తులో సాంస్కృతిక కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నడచుటకు కావలసిన సూచనలను అందించారు, రఘునాథ్. ఆయన ఇచ్చిన సూచనలను పాటించక పోవడమే 26 సంవత్సరాల తరువాత కూడ మన సంఘాలు ఎదుర్కొంటున్న కష్టాలకు కారణం.

తదుపరి, 1980 లో ప్రప్రధమ ఉత్తర అమెరికా భారతీయుల సమ్మేళనానికి నేను కన్వీనరుగా ఉన్నప్పుడు, మొదట రఘునాథ్ నే కొన్ని బాధ్యతలను తీసుకోవలసినదిగా కోరడం నాకు ఆయన కార్యదీక్షలో ఉన్న నమ్మకమే కారణం.

తెలుగు వెలుగు, తానా పత్రిక, తెలుగు జ్యోతిలకు సంపాదకీయం స్వీకరించినపుడు ప్రతి నెలా తెలుగులో వ్రాసియివ్వమని కథలు, కథానికలు పద్యాలు, గేయాలు, వ్యాసాలు నాకిచ్చేవారు, గడువును నొక్కివక్కాణించుతూ.

ఇప్పుడు ఆయన దాతృత్వాన్ని గూర్చి తెలియపరుస్తాను. దాతృత్వం మూడు విధాలుగ వెల్లుబుకుతుంది: (1) కార్యాచరణకు కావలసిన కాలవ్యయం చేయగలగడం; (2) మేధాశక్తితో సంఘ సత్ప్రవర్తనను ఇనుమడింప చేయగలగడం; (3) ఆర్ధిక సంపత్తును దురదృష్ట ప్రజల ప్రయోజనార్ధం సద్వినియోగం చేయగలగడం; ఈ మూడు పద్ధతులను ఆచరించిన ఆపద్బంధువు రఘునాథ్.

ప్రప్రధమంగా, గత ముప్పై సంవత్సరాలలోను కార్యదీక్షకు, ఆచరణకు అమెరికాలోను, భారతదేశంలోను ఆయన వ్యత్యించిన సమయం బహుకొద్దిమంది మాత్రమే సాధించగలిగారనడంలో అతిశయోక్తిలేదు. మన తెలుగు సంఘాలకు, లలిత కళల నిర్వహణకు, సారస్వత పత్రికా ప్రచురణకు నిరంతరము ఆయన చేసిన కృషి దీనికి తార్కాణం..

మన సంఘాలు అనాలోచితంగా తప్పుడు మార్గం పడుతున్నాయని అనుమానించిన తక్షణమే తను ప్రత్యక్షంగా విమర్శించి, సన్మార్గసూచనలను ఇవ్వడం మనందరకూ తెలిసిన విషయమే.

తను ఆర్ధికంగా యెన్నో యిబ్బందులు పడిన సమయంలో కూడ తనకు ఉన్నదానిలో కొంత దురదృష్ట ప్రజల ప్రయోజనార్ధం పాలు పంచుకోవడం అన్నింటికంటే యోగ్యతగల దాతృత్వం. ఆధ్యాత్మిక చింతన సదా కల రఘునాథ్ అమెరికాలో చాలా దేవాలయాల నిర్మాణానికి తోడ్పడ్డారు. బాలమురళీకృష్ణ, చినసత్యం ఫౌండేషన్లకు, మ్యూజిక్ కళాశాలల అభివృద్ధికి తోడ్పడ్డారు. గత పది సంవత్సరాలలోను వేగేశ్న సేవాసంస్థ (హైదరబాద్) వికలాంగులకు చేస్తున్నసేవలో ముఖ్య భాగస్వామిగా అవతరించి వికలాంగులు నిష్ప్రయోజకులు కారని, సంఘానికి గౌరవనీయులైన భావి పౌరులని నిరూపించి తన సేవాధర్మాన్ని ద్విగుణీకృతం చేసుకున్నారు.

ఇటువంటి సహృదయుడు, సత్కార్యసాధనాపరుడు, కర్మయోగి రఘునాథ్ మన మనస్సులలో చిరంజీవి. తన ఆత్మకు శాంతి కలుగుగాక అని ప్రార్ధిస్తూ, ప్రభ, ఉష, శ్యామ్, శ్రీనాథ్‌లకు హృదయపూర్వక సంతాపాన్ని తెలియపరుస్తున్న...